నిలిచిన నిర్మాణ అనుమతులు!

- సర్వే నంబర్ 145, 163లో భవన నిర్మాణాలకు అనుమతి నిరాకరణ
- పొంతనలేని సమాధానాలు చెబుతున్న అధికారులు
- ఆందోళనలో ఆయా కాలనీల వాసులు
- ఎమ్మెల్యే జోక్యంతో పరిశీలిస్తామన్న కలెక్టర్



ఎన్‌ఆర్‌ఎస్‌ఏ కాలనీ ప్రవేశ ద్వారం

మూడు దశాబ్దాల క్రితం వెలిసిన కాలనీల్లో జీహెచ్‌ఎంసీ అధికారులు అకస్మాత్తుగా భవన నిర్మాణ అనుమతులు నిలిపివేశారు. కారణం చెప్పకుండా కలెక్టర్‌ను కలవమంటున్నారు. కలెక్టర్ కార్యాలయానికి వెళితే.. అదేంటో అక్కడే చూసుకోవాలని తిప్పి పంపుతున్నారు. సమస్య ఏమిటో చెప్పకుండా, అనుమతులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ హైదర్ నగర్ గ్రామ సర్వే నంబర్ 145, 163 పార్టులలో వెలిసిన సాయినగర్, సర్దార్ పటేల్‌నగర్, వసంతనగర్, సత్యనారాయణస్వామి కాలనీ, మిడోల్యాండ్స్, సీబీసీఐడీ కాలనీ, ఎన్‌ఆర్‌ఎస్‌ఏ కాలనీ, శిల్ప ఎవెన్యూ తదితర కాలనీల్లో భవన నిర్మాణ అనుమతులను అధికారులు నిలిపివేశారు.

కేపీహెచ్‌బీకాలనీ: నెల రోజులుగా అనుమతుల కోసం వెళ్లిన ఫైల్స్ ఏవీ కూడా జీహెచ్‌ఎంసీ అధికారులు క్లియర్ చేయకపోగా కలెక్టర్ పరిశీలనకు పంపించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయకుండా కలెక్టర్ పరిశీలనకు పంపడంతో ఆయా కాలనీలో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 40 సంవత్సరాల కిందట హుడా లేఅవుట్ ద్వారా ఏర్పడిన వసంత్‌నగర్‌కాలనీలో కూడా అనుమతులు నిలిపివేయడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాడు కోర్టు తీర్పుతో నిర్మాణాలు

హైదర్‌నగర్ గ్రామానికి చెందిన సర్వే నంబర్ 145, 163, 172లు ప్రాపర్టీస్ కింద సివిల్ దావా నంబర్ 14/1958 కింద కోర్టు కేసులో ఉన్నాయి. హైదర్‌నగర్ గ్రామంతో పాటు నగర శివారులోని అనేక గ్రామాల్లో ఇట్టి సివిల్ దావా నంబర్ కేసులు ఉన్నాయి. పాయిగా వారసుల నడుమ ఆస్తుల పంపకాలకు సంబంధించిన కేసులు అవి. మరో వైపు సదరు భూములు 1954–55 ఖస్రా పహానీ ప్రకారం సర్కారు భూములుగా రికార్డుల్లో నమోదయ్యాయి. దీంతో ఆ భూముల హక్కుల విషయంలో ప్రభుత్వ, ప్రైవేట్ (పాయిగా) నడుమ అనేక కేసులు నడిచాయి. ప్రత్యేకంగా సర్వే నంబర్ 145, 163 విషయానికి వస్తే లోయర్‌కోర్టు మొదలుకొని సుప్రీం కోర్టు వరకు నడిచిన కేసులో ప్రభుత్వానికి వ్యతిరేకంగానే తీర్పు వచ్చింది. అప్పటి నుంచి ఇక్కడ లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణం కోసం అనుమతులు ఇవ్వడంతో అనేక అపార్టుమెంట్లు కూడా నిర్మించారు. దాదాపు మూడు దశాబ్దాలుగా ఇళ్ల నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన వంటివి అన్ని కూడా ప్రభుత్వ అనుమతులతో జరిగాయి. ఒక్కసారిగా మార్చి నెలలో అనుమతుల కోసం వెళ్లిన ఫైల్స్‌ను జీహెచ్‌ఎంసీ అధికారులు కలెక్టర్ పరిశీలన కోసం పంపగా.. అక్కడే నిలిచిపోయాయి. దీంతో ఇటీవలే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో ఆయా కాలనీ వాసులు కలెక్టర్‌ను కలిశారు. ఫైనల్ డిక్రీ మొదలుకొని కోర్టు తీర్పుల వరకు అన్ని అడిగి తెలుసుకున్న కలెక్టర్ పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అనుమతులు నిలిపివేయడం సరికాదు



అనేక సంవత్సరాల కిందట వెలసిన కాలనీల్లో అకస్మికంగా అనుమతులు నిలిపివేయడం సరికాదు. కారణాలు చెప్పకుండా అనుమతులు ఆపి ప్రజలను ఇబ్బంది పెట్టవద్దు. ప్రజలు సొంతింటి కోసం అనేక వ్యయ ప్రయాసలు ఓర్చి స్థలాలు కొని ఇల్లు కట్టుకోవడానికి అనుమతి అడిగితే ఆపడం ఎంత వరకు సమంజసం. ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాల్సిన అధికారులు ఎవరి ఒత్తిడికో లోనై ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దు.

– మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్యే

నాడు ఎలాంటి ఇబ్బందులు లేవు



సర్వే నంబర్163 పార్టులో ఎన్‌ఆర్‌ఎస్‌ఏ ఉద్యోగులుగా ఇళ్ల స్థలాలు కొన్నప్పుడు ప్రభుత్వం నుంచి అనుమతుల కోసం వెళ్లాము. నాటి కలెక్టర్ ప్రేమ్‌చంద్రారెడ్డి మొదలుకొని సీనియర్ ఐఏఎస్‌లు, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, చీఫ్ సెక్రటరీ వరకు అందరూ పరిశీలించిన తరువాత ల్యాండ్ సీలింగ్‌తో పాటు కన్వర్షన్ డబ్బుల వరకు అన్ని చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నాము. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఇబ్బందులు రాలేదు. అకస్మాత్తుగా అనుమతులు నిలిపివేయడంతో ఆందోళనకు గురవుతున్నాం.

– హనుమంతరావు, ఎన్‌ఆర్‌ఎస్‌ఏ కాలనీ

రేపు రామ్‌దేవ్‌రావ్ ఆసుపత్రిలో వైద్య శిబిరం

ఆల్విన్‌కాలనీ: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రపంచ ఆరోగ్య సంస్థ 'హెల్తీ బిగినింగ్స్, హోప్‌ఫుల్ ఫ్యూచర్స్' 'ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనక భవిష్యత్‌లు' అనే నినాదంతో ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ సంస్థ తల్లి, పిల్లల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. దీన్ని పురస్కరించుకొని రాందేవ్ రావ్ ఆసుపత్రిలో తల్లి, పిల్లల వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ఎండీ డాక్టర్ కె. కమలాకర్, సీఈఓ డాక్టర్ యోబు శనివారం తెలిపారు. ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత గైనకాలజీ, డిపియాట్రిక్ కన్సల్టేషన్, మోమొగ్రఫీ తదితర పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు.

పాత వస్తువులను సేకరించిన అధికారులు



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి సర్కిల్ నాలుగు వార్డుల్లో శనివారం 'మీకు అనవరం లేని వస్తువులు మాకు ఇస్తే' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ విధంగా ప్రతి శనివారం కూడా మిగతా వార్డుల్లో కూకట్‌పల్లి సర్కిల్‌లో నిర్వహిస్తామని కూకట్‌పల్లి ఉప కమిషనర్ గంగాధర్ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్, సర్కిల్ ఎస్ఆర్‌పీలు తెలిపారు. దీంతో చెత్తా చెదారం బయట, నాలాల్లో వేయకండా ప్రజలకు ఇది ఒక మంచి అవకాశం అవుతుందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ శనివారం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రవీంద్రభారతి పాఠశాలలో స్నాతకోత్సవం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ ఫేజ్ 3లోని రవీంద్రభారతి పాఠశాలలో శనివారం చిన్నారుల స్నాతకోత్సవం కనుల పండుగగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిరూపమ విచ్చేసి చిన్నారులకు యూకేజీ పట్టాలను ప్రదానం చేశారు. చిన్నారుల వేషధారణ చూపరులను ఆకర్షించింది. కార్యక్రమంలో నికి పాఠశాల డీన్ శిరీష, డివిజన్ ఇన్‌చార్జి హఫీజ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీకి తాత్కాలిక బ్రేక్ !

పోర్టబులిటీ వెసులుబాటుతో వలసదారుల ఎగబాటు

- పక్క జిల్లాల నుంచి బియ్యం తరలింపునకు ప్రత్యేక చర్యలు
- 5.23 లక్షల రేషన్‌కార్డులకు 10,640 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం
- కార్డుదారులందరికీ సన్నబియ్యం అందిస్తామంటున్న సివిల్ సప్లైశాఖ

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సన్నబియ్యం పంపిణీకి తాత్కాలికంగా బ్రేక్ పడింది. రేషన్ షాపుల వద్దకు ఆహార భద్రతా కార్డులున్న లబ్ధిదారులు వెళ్తే.. సోమవారం నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తామని డీలర్లు పేర్కొనడంతో లబ్ధిదారులు వెనుదిరిగారు.

పోర్టబులిటీ వెసులుబాటుతో ఖాళీ

పోర్టబులిటీ వెసులుబాటుతో సన్నబియ్యం కోసం వలస కుటుంబాలు ఎగబడటంతో రేషన్‌షాపులకు విడుదలైన సన్నబియ్యం ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఘట్కేసర్, మేడ్చల్ మండలాలతో పాటు వలస కుటుంబాలు అధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లోని రేషన్‌షాపుల్లో సన్నబియ్యం స్టాక్ అంతా ఖాళీ అయింది.

అధికంగా పరిశ్రమలు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా పరిశ్రమలకు కేంద్రంగా ఉండటం వల్ల రాష్ట్రంలోని ఇతర జిల్లాలు, ప్రాంతాల నుంచి వివిధ పనుల కోసం వచ్చిన వలస కుటుంబాలు గత కొన్నాళ్లుగా ఇక్కడే రేషన్ బియ్యాన్ని పొందుతున్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పోర్టబులిటీతో ఆహారభద్రతా కార్డు కలిగి ఉన్న వారు ఎక్కడైనా రేషన్‌బియ్యాన్ని తీసుకునే వెసులుబాటు లభించింది.

◆ రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నుంచి ఆహార భద్రతా కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో పేద ప్రజలంతా సన్నబియ్యం తీసుకునేందుకు ముందుకొస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాకు పక్క జిల్లాల్లోని గోదాముల నుంచి రేషన్ షాపులకు జిల్లా పౌరసరఫరాల శాఖ తరలించిన సన్నబియ్యం రెండు, మూడు రోజుల్లోనే ఖాళీ అయ్యాయి. దీంతో జిల్లా యంత్రాంగం ప్రత్యేక కృషితో సన్నబియ్యాన్ని రేషన్‌షాపులకు తరలించేందుకు చర్యలు తీసుకుంటోంది.

8 వేల మెట్రిక్ టన్నుల పంపిణీ

జిల్లాలోని రేషన్‌షాపులకు ఇప్పటి వరకు తరలించిన 8 వేల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం ఆహార భద్రతా కార్డుదారులకు పంపిణీ చేశారు. శనివారం సాయంత్రానికి మరో వేయి టన్నుల సన్న బియ్యాన్ని జిల్లాకు తరలించినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ జనరల్ మేనేజర్, ఇన్‌చార్జ్ డీఎస్ఓ సుగుణబాయి తెలిపారు. మిగతా స్టాక్ కూడా త్వరలో జిల్లాకు చేరుకుంటుందని పేర్కొన్నారు. బియ్యం కోసం ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికార వర్గాలు ప్రకటించాయి.

5.23 లక్షల రేషన్ కార్డులు

మేడ్చల్ జిల్లాలోని 619 రేషన్ దుకాణాల ద్వారా 5,23,938 రేషన్‌కార్డు దారులకు ప్రతినెల ఉచితంగా ఒకరికి 6 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇందులో 17,18,351 మంది లబ్ధిదారులు (యూనిట్లు) ఉండగా.. ఒకరికి 6 కిలోల చొప్పున 10640.052 మెట్రిక్ టన్నుల బియ్యం అందజేస్తున్నారు. ఉగాది కానుకగా ఈనెల నుంచి రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సన్నబియ్యం అందిస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు చెదల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. విశాఖ జిల్లా నక్కపల్లి గ్రామానికి చెందిన కొత్త నూకయ్యశెట్టి(62) కుటుంబం మూడు సంవత్సరాల క్రితం వలస వచ్చి కుత్బుల్లాపూర్ గణేష్ హౌసింగ్ సొసైటీలో నివాసముంటున్నాడు. జీవితంపై విరక్తి చెందిన అతను శుక్రవారం సాయంత్రం చెదల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు సమీపంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అల్లుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీ ఈటలకు ఆహ్వానం

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అంజయ్యనగర్‌లోని శ్రీ వీర అభయాంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణానికి హాజరవ్వాలని ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆలయ ఫౌండర్ ట్రస్టీ గోపాల్ ముదిరాజు ఆహ్వానించారు. శనివారం ఆయన నివాసంలో ఎనుగుల తిరుపతి, మక్కాల నర్సింగ్‌రావు, ఎం నర్సింగ్‌తో ఆహ్వాన పత్రాన్ని అందించారు.



బీజేపీ మూసాపేట డివిజన్ అధ్యక్షుడిగా ఎర్ర స్వామి




నియామకపత్రం అందజేస్తున్న ఎంపీ ఈటల

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్‌కు చెందిన ఎర్ర స్వామిని బీజేపీ డివిజన్ అధ్యక్షుడిగా నియమిస్తూ ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ జిల్లా ఎన్నికల అధికారి ఆచారి నియామకపత్రాన్ని శనివారం అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారు సూచించారు.

రాములోరి వేడుకలకు ఆలయాలు ముస్తాబు

మూసాపేట: రాములోరి కల్యాణానికి కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని దేవాలయాలు ముస్తాబయ్యాయి. శ్రీరాముని, ఆంజనేయ స్వామి ఆలయాలు విద్యుత్ కాంతులతో, చలువ పందిళ్లతో సరికొత్త శోభను సంతరించుకున్నాయి. ఉదయం 4 గంటల నుంచే ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. భరత్‌నగర్ కాలనీలోని హరి హర క్షేత్రం, ప్రగతినగర్‌కాలనీలోని ఆంజనేయ స్వామి ఆలయంలో, జనతానగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం, గూడ్స్ షెడ్ రోడ్డులోని వీర హనుమాన్ ఆలయంలో, కూకట్‌పల్లిలోని పట్టాభి సీతారామచంద్ర స్వామి దేవాలయం, వివేకానందనగర్ కాలనీ, సప్తగిరి కాలనీలోని సీతారామచంద్ర స్వామి ఆలయం, కేపీహెచ్‌బీ కాలనీలోని పలు దేవాలయాల్లో కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు.



విద్యుత్ దీపాలతో రామాలయం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో శ్రీ రామ నవమి వేడుకలకు పురస్కరించుకొని కూకట్‌పల్లి పురవీధులన్నీ విద్యుత్ అలంకరణతో విరాజిల్లుతున్నాయి. జాతీయ రహదారి నుంచి ప్రధాన ద్వారం నుంచి దేవాలయం వరకు విద్యుత్ అలంకరణ ఏర్పాటు చేశారు. అదే విధంగా జాతీయ రహదారి దేవాలయం కమాన్ నుండి శ్రీసీతారామచంద్ర స్వామి రామాలయం వరకు మరో ద్వారం కూడా విద్యుత్ అలంకరణ ఏర్పాటు చేశారు. విద్యుత్ అలంకరణతో పాటు శ్రీసీతారామచంద్ర స్వామి భారీ కటౌట్లను విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేయటంతో కూకట్‌పల్లి ప్రాంతం విద్యుత్ అలంకరణతో శోభాయమానంగా మారింది. ఆలయ పునర్నిర్మాణం తరువాత ఇంత పెద్దగా ఏర్పాటు చేయటం ఇదే మొదటిసారి.



భరత్‌నగర్‌కాలనీలోని హరి హర క్షేత్రంలో ...

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

జయంతి వేడుకలో వక్తలు

పూలమాలేసి నివాళులర్పించిన నాయకులు

కూకట్‌పల్లి(జోన్‌బృందం): స్వాతంత్ర్య సమర యోధుడు, కేంద్ర మాజీ మంత్రి బాబు జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని వివిధ పార్టీలు, దళిత సంఘాల నాయకులు అన్నారు. ఆయన జయంతి వేడుకలను శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సామాజిక హక్కుల కోసం పోరాడిన మహానేత అని అన్నారు.



మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌లు



కార్యాలయంలో చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, అధికారులు



వివేకానందనగర్ కమ్యూనిటీ హాల్‌లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం



ఎల్లమ్మబండలో .. పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు



ఓల్డ్ బోయిన్‌పల్లిలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్



నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి యాదగిరి, నాయకులు



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు మధుకర్, నర్సింహ తదితరులు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి తదితరులు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు తదితరులు

మెట్రో స్టేషన్ వద్ద వివాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలి



ఇన్‌స్పెక్టర్ ముత్తు యాదవ్‌కు సమస్యను వివరిస్తున్న నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ వద్ద నిత్యం వివిధ వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై బీజేపీ బాలాజీనగర్ డివిజన్ జనరల్ సెక్రటరి ఆకుల రామ్, సీనియర్ నాయకుడు వినోద్ శనివారం ట్రాఫిక్ సీఐ ముత్తు యాదవ్‌ను కలిసి సమస్యను వివరించారు. సమస్యను జీహెచ్‌ఎంసీ, మెట్రో వారి సహకారంతో పరిష్కరిస్తామన్నారు. వెంకటరమణ, వెంకటేష్, లహరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్ ఫైనాన్స్‌లో అగ్నిప్రమాదం



మూసాపేట: కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం సమీపంలో ఉన్న క్రోమో బిల్డింగ్ పైన మూడవ అంతస్తులోని శ్రీరామ్ ఫైనాన్స్‌లో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుదాఘాతంతో మంటలు చెలరేగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఫైల్స్, ఫర్నీచర్, ఏసీ కాలిపోయాయి. సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని కూకట్‌పల్లి ఫైర్ స్టేషన్ అధికారి తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: ప్రేమ విఫలమవ్వడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కట్యూరు మండలం కరుకుర్తి గ్రామానికి చెందిన మహేశ్వరం నాగరాజు (25) కుత్బుల్లాపూర్ బ్యాంక్ కాలనీలో తన స్నేహితులతో కలిసి నివాసమంటున్నాడు. క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తన సొంత గ్రామానికి చెందిన ఓ యువతీతో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. నాగరాజు సదరు యువతీతో తరచూ ఫోన్ చాటింగ్ చేసేవాడు. శుక్రవారం యువతి ప్రేమను నిరాకరించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి స్నేహితుడు జితేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షటిల్ కాక్ తీస్తుండగా విద్యుదాఘాతంతో మృతి

కుత్బుల్లాపూర్: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం .. సుచిత్ర వెన్నెలగడ్డకు చెందిన శేషు(36), శాంతి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. శేషు మూసాపేట్‌లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం శేషు తన పిల్లలతో కలిసి షటిల్ ఆడుతుండగా కాక్ విద్యుత్ తీగలపై పడింది. ఈ క్రమంలో కాక్‌ను తీసేందుకు యత్నించగా విద్యుదాఘాతంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.